క్లుప్తంగా

వాహనాల తనిఖీ

వీణవంక: వాహన ధృవీకరణ పత్రాలు, నెంబర్ ప్లేట్ లేని, నిబంధనలు పాటించనివారి వాహనాలను సీజ్ చేస్తామని జమ్మికుంట రూరల్ సీఐ సురేశ్ అన్నారు. మంగళవారం వీణవంక మండలంలోని రెడ్డిపల్లిలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ట్రిపుల్ రైడింగ్ చేయొద్దని, హెల్మెట్, సీటు బెల్టు ధరించాలని, ఆటో డ్రైవర్లు డ్రెస్ కోడ్ పాటించాలన్నారు. మద్యం సేవించి పట్టుబడితే జరిమానాతో పాటు జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి, పోలీసులు, తదితరులున్నారు.

విద్యార్థులకు అభినందనలు

మానకొండూర్: తిమ్మాపూర్‌లోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 11 మంది విద్యార్థులు ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికై నట్లు చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి తెలిపారు. నియామక ప్రక్రియలో భాగంగా రెండు రోజులపాటు నిర్వహించిన రాత, మౌఖిక పరీక్ష, టెక్నికల్ ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ట్రైనీగా ఎంపిక చేశారు. వీరికి వార్షిక వేతనం రూ.4 లక్షలు ఉంటుందని, ప్రతీ విద్యార్థి విషయ పరిజ్ఞానం, సాంకేతిక, ఉద్యోగ సాధన నైపుణ్యాలు ప్రదర్శించి ఎక్కువ సంఖ్యలో నియామక పత్రాలు పొందాలని సూచించారు. ప్రస్తుత కాలంలో మంచి ఉద్యోగం సాధించాలంటే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. తరగతి గదిలో నేర్చుకున్న అంశాలతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలన్నారు. అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

అభివృద్ధి పనులను అడ్డుకుంటే చర్యలు

చొప్పదండి: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను అడ్డుకుంటే చట్టప్రకారం చర్యలు తప్పవని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ హెచ్చరించారు. పాఠశాలలోని ఓపెన్ జిమ్ పనులను మంగళవారం పరిశీలించారు. రూ. 15 లక్షల నిధులతో పనులు ప్రారంభించామని, ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న జిమ్ పరికరాలను ఎవరైనా ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఓపెన్ జిమ్ వ్యాయమం, వాకింగ్ చేసేవారికి, విద్యార్థులకు ఉపయోగపడేలా తీర్చిదిద్దుతామని, త్వరలో పనులు పూర్తి చేస్తామని చెప్పారు. వెంట వార్డు కౌన్సిలర్ కొట్టె అశోక్, తదితరులున్నారు.

హోం మంత్రి రాజీనామా చేయాలని ఆందోళన

శంకరపట్నం: హోం మంత్రి మహమూద్ అలీ బంధువు సైఫ్ వేధింపులతోనే వరంగల్ పీజీ మెడికల్ విద్యార్థిని ప్రీతి ఆత్మహత్య చేసుకుందని, హోంమంత్రి తన పదవికి రాజీనామా చేయాలని కేశవపట్నంలో మంగళవారం బీజేపీ నాయకులు కరీంనగర్– వరంగల్ రహదారిపై రాస్తారోకో చేశారు. దీంతో వాహనాలు నిలిచిపోయాయి. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదని, గిరిజన, దళిత మహిళలపై దాడులు ఎక్కువయ్యాయని ఆరోపించారు. ప్రీతి ఆత్మహత్య కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఆందోళన కారులకు నచ్చచెప్పి రాస్తారోకో విరమింపజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు అనిల్, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు సారయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, అధికార ప్రతినిధి సమ్మిరెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

జ్యూట్ బ్యాగుల తయారీపై మహిళలకు శిక్షణ

శంకరపట్నం: మండలంలోని కాచాపూర్ గ్రామంలో మహిళలకు జ్యూట్ బ్యాగుల తయారీ శిక్షణ శిబిరాన్ని మంగళవారం సర్పంచ్ కోండ్ర రాజయ్య ప్రారంభించారు. దేశపాండే ఫౌండేషన్, కాకతీయ సాండ్ బాక్స్ ఆధ్వర్యంలో మహిళలకు 13 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. బ్యాగుల తయారీలో మెలుకవలు నేర్చుకోవాలని సూచించారు. నిర్వాహకులు భాస్కర్, మునేష్, ట్రైనర్లు నసీర్, భాగ్య పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

గన్నేరువరం: తిమ్మాపూర్ మండలం మహాత్మా నగర్ గ్రామంలోని రాంలీలా మైదానంలో ఆరో తేదీన నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం సర్పంచులు, ఎంపీటీసీ, మహిళ సంఘాల సభ్యులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకన్న, మహిళ అధ్యక్షురాలు కుసుంబ నవీన, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు తీగల మోహన్‌రెడ్డి, ఏవో కిరణ్మయి, ఏపీఎం లావణ్య, న్యాత సుధాకర్ పాల్గొన్నారు.

రూ. 51 వేల విరాళం

చొప్పదండి: పట్టణంలో నిర్మిస్తున్న సాయిబాబా ఆలయానికి చొప్పదండికి చెందిన గుర్రం వెంకటరాంరెడ్డి, రేణుక దంపతులు మంగళవారం రూ. 51,116 ఆలయ చైర్మన్ గుర్రం హన్మంతరెడ్డికి విరాళంగా అందించారు. 6 నుంచి 9వ తేదీ వరకు ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహిస్తున్నామని హన్మంతరెడ్డి తెలిపారు. ఆలయ నిర్వహణ ట్రస్టు సభ్యులు లింగయ్య, రాము, ఇంద్రసేనా రెడ్డి, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ విజ్ఞాన దినోత్సవం

సాక్షి నెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో మంగళవారం జాతీయ విజ్ఞాన దినోత్సవం (నేషనల్ సైన్స్ డే) ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సీవీ రామన్‌ను స్ఫూర్తిగా తీసుకుని క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. విద్యార్థులు తయారు చేసే ప్రాజెక్టులు, ప్రదర్శనలను అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పరిశీలించి అభినందించారు. విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభ వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా వెలుగులోకి వస్తుందని, భవిష్యత్‌లో శాస్త్రవేత్తలుగా ఎదుగుతారని, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలని పలువురు కోరారు. సైన్స్ రంగంలో ఎంతోమంది మహానుభావుల ప్రయోగాల ఫలాలను అనుభవిస్తున్నారని, వారిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని, పరిశోధనాత్మక దృక్పథం, పరిశీలన అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. చిగురుమామిడి మండలం రామంచ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు హర్యానా రాష్ట్రంలో పాల్గొన్న సాహస యాత్ర నమూనాలను రూపొందించారు.


గన్నేరువరం ప్రభుత్వ పాఠశాలలో


హుజూరాబాద్: ప్రదర్శనలు తిలకిస్తున్న ఎంఈవో


చిగురుమామిడి: రామంచ జెడ్పీపాఠశాలలో..


రామడుగు: వెలిచాలలో...


గన్నేరువరం: విజ్ఞాన్ కాన్వెంట్‌లో..


చొప్పదండి క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో..



హుజూరాబాద్‌రూరల్: కాట్రపల్లిలో విద్యార్థుల ప్రదర్శనలు


సైదాపూర్: నివాళి అర్పిస్తున్న హెచ్‌ఎం అనురాధ, తదితరులు


వీణవంకలో సీవీ రామన్ చిత్రపటానికి హెచ్‌ఎం, టీచర్ల నివాళి

మాకూ కంటి పరీక్షలు చేయండి

- నేత్ర సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులు
- కరోనా సమయంలో ఆన్‌లైన్ తరగతులకు అలవాటుపడిన వైనం
- స్మార్ట్‌ఫోన్, ట్యాబ్, ల్యాప్‌టాప్‌ల వినియోగంతో పెరిగిన సమస్యలు
- కంటి వెలుగు శిబిరాలు అమలు చేస్తే ప్రయోజనం


కందుగుల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్టడీ అవర్స్‌లో పదో తరగతి విద్యార్థులు

హుజూరాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం కేవలం వయోజనులకు మాత్రమే పరిమితం చేశారు. పద్దెనిమిదేళ్లలోపు వారికి నేత్రాలకు సంబంధించిన సమస్యలుంటే కార్యక్రమం ద్వారా సేవలు, లబ్ధి చేకూరడం లేదు. రెండేళ్ల క్రితం కరోనా కారణంగా విద్యా సంస్థలు మూతపడటంతో ఆన్‌లైన్ ద్వారా తరగతులు నిర్వహించారు. దీంతో చిన్నారులు స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లకు అలవాటు పడ్డారు. మరోవైపు నిరుపేద కుటుంబాలకు చెందిన చిన్నారులు సరైన పోషకాహారం తీసుకోకపోవడంతో చిన్న వయసులోనే కంటి సమస్యలకు గురవుతున్నారు. ఈనేపథ్యంలో వారికి కూడా శిబిరాలు నిర్వహించాల్సిన ఆవశ్యకత ఉంది.

పుస్తకాలతో కుస్తీ

హుజూరాబాద్ మండల వ్యాప్తంగా 13 ప్రభుత్వ, 17 ప్రైవేట్ ఉన్నత పాఠశాలున్నాయి. 2022–23 విద్యాసంవత్సరం పదో తరగతి విద్యార్థులు 447 మంది బాలురు, 441 మంది బాలికలు. ఈసారి విద్యాశాఖ 11 పేపర్లను ఆరు పేపర్లకు కుదించడంతో విద్యార్థులు ఉదయం, సాయంత్రం పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. నిద్రాహారాలు మాని రాత్రి వేళ పుస్తకాలతో కుస్తీ పడుతుండటంతో విద్యార్థులు కంటి సమస్యలతో బాధపడుతున్నారు.

సెల్‌ఫోన్ వినియోగంతో పెరిగిన సమస్యలు

కరోనా సమయంలో అన్ని తరగతుల విద్యార్థులకు విద్యా సంస్థలు ఆన్‌లైన్ ద్వారా తరగతులు నిర్వహించాయి. ప్రతి విద్యార్థి స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్, ట్యాబ్‌లకు అలవాటుపడ్డారు. వీటిల్లో అక్షరాలు చిన్నగా కనిపించటం, తదేకంగా గమనించటం, వాటినుంచి వెలువడే కాంతి వల్ల చాలా మంది చిన్నారులు కంటి సమస్యల బారినపడ్డారని నేత్ర వైద్య నిపుణులు తెలిపారు. దీనికి తోడు టీవీలకు అతుక్కుపోతున్నారని, ప్రస్తుతం చిన్నారులు తలనొప్పి, కళ్లల్లో నుంచి నీరు కారడం వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారని వైద్యులు చెబుతున్నారు.

కంటి వెలుగు అమలు చేస్తే ప్రయోజనం

కరోనా కంటే ముందు విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే(రాష్ట్రీయ బాల స్వస్థ్ కార్యక్రమం) కింద సాధారణ పరీక్షలు నిర్వహించి నేత్ర సమస్యలు ఉన్నవారిని ఆసుపత్రులకు రిఫర్ చేశారు. గ్రామీణులు, నిరుపేదలు ఆర్థిక స్థితిగతుల కారణంగా పిల్లలకు చికిత్స చేయించలేకపోయారు. వీరి వివరాలు వైద్యారోగ్యశాఖ, ఆర్‌బీఎస్‌కే విభాగం వద్ద అందుబాటులో లేనట్లు సమాచారం. కంటి వెలుగు శిబిరాలు విద్యార్థులకు అమలు చేస్తే ప్రయోజనం కలగనుంది.

కళ్లద్దాలు అందించాలి



పుస్తకాలు చదువుతుంటే కళ్లు నొప్పి పెడుతున్నాయి. అదే పనిగా పుస్తకాలను చదువుతున్న సమయంలో కళ్లు మసకమసకగా కనబడుతున్నాయి. కంటి వెలుగు శిబిరాల్లో పరీక్షలు నిర్వహించి కళ్లద్దాలు అందించాలి.

– మెరుగు అరుణ్, పదో తరగతి, పెద్దపాపయ్యపల్లి

తలనొప్పిగా ఉంటోంది



స్టడీ అవర్స్‌లో గంట చదివితే తలనొప్పిగా వస్తోంది. పుస్తకాలను దగ్గర పట్టుకొని అదే పనిగా చదవటం మూలంగా అవస్థలు పడాల్సి వస్తోంది. మాకు కంటి వెలుగు శిబిరాలు నిర్వహించి పరీక్షలు చేయాలి.

– మొగిళి సంగీత, పదో తరగతి, కందుగుల

ఇబ్బంది పడుతున్నారు



రాత్రి వేళ తలనొప్పిగా ఉందంటూ పుస్తకాలు పక్కన బెడుతున్నారు. టీచర్లు వాట్సాప్ గ్రూప్‌ల్లో పెట్టే నోట్స్, ప్రశ్నపత్రాలు సరిగా కనబడక ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థులకు కంటి వెలుగు పరీక్షలు నిర్వహించాలి.

– మ్యాదగోని శ్రీనివాస్, విద్యార్థి తండ్రి, పెద్దపాపయ్యపల్లి

అగ్గితెగులు నివారణ చర్యలు చేపట్టాలి

గంగాధర: వరిలో అగ్గి తెగులు నివారణకు రైతులు చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారి రాజు సూచించారు. మండలంలోని సర్వారెడ్డిపల్లి, ముప్పిడిపల్లి గ్రామాలలో పంట పొలాలను మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా పిచికారీ చేయాల్సిన మందులు, ఇతర జాగ్రత్తలు వివరించారు.

ఇల్లందకుంట: మండలంలోని టేకుర్తి గ్రామంలో కోర్ కార్బోనెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ పద్మపాణి స్వచ్ఛంద సంస్థ కరీంనగర్ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామ పంచాయతీ వద్ద రైతులకు తడి, పొడి వరిసాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఓ తిరుపతి మాట్లాడుతూ... వరిసాగులో తడి, పొడి పద్ధతిని ప్రోత్సహించేందుకు కార్బన్ క్రెడిట్ ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లోకి ఏడాదికి ఎకరాకు రూ.800 జమ అవుతాయని, రైతులు పట్టాపాస్‌బుక్, బ్యాంకు ఖాతా బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్ అందజేయాలన్నారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మోటపోతుల ఐలయ్య, వాసుదేవ్, మండల కో ఆర్డినేటర్ సుమలత, రైతులు పాల్గొన్నారు.


ఇల్లందకుంట: మాట్లాడుతున్న ఏఈవో తిరుపతి

కంటి వెలుగు శిబిరానికి స్పందన

చిగురుమామిడి: మండలంలోని రేకొండ, ముదిమానిక్యం గ్రామాల్లో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరానికి స్పందన లభిస్తోందని, మంగళవారం రెండు గ్రామాల్లో దాదాపు 580 మందికి కంటి పరీక్షలు చేశామని చిగురుమామిడి మెడికల్ ఆఫీసర్ ధర్మానాయక్ తెలిపారు. కంటి వెలుగు మెడికల్ ఆఫీసర్ నిర్మల, సూపర్‌వైజర్ హేమలత, ఏఎన్‌ఎంలు ధనలక్ష్మి, స్వాతి, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

జమ్మికుంట: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తనుగుల సర్పంచ్ చిలుముల వసంతరామస్వామి అన్నారు. మంగళవారం గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. దృష్టిలోపం ఉన్నవారు పరీక్షలు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నిరోషారామస్వామి, ఉప సర్పంచ్ ప్రియాంక మహేష్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, తిరుపతి, మెడికల్ ఆఫీసర్ సనా జావేరియా, మౌనిక, కార్యదర్శి భద్రయ్య, వార్డు సభ్యులు ప్రతాప్, శారద, శ్రీలత, శ్రీనివాస్, లావణ్య, ఏఎన్‌ఎం మణెమ్మ, ఆశా వర్కర్ సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.


కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న ధర్మానాయక్

ఘనంగా' టైలర్స్ డే'

జమ్మికుంట: పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద మంగళవారం టైలర్స్ డే నిర్వహించారు. టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు దేశిని కోటి ముఖ్య అతిథిగా హాజరై కుట్టు మిషన్ సృష్టి కర్త సర్ విలియస్‌హో చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ, అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ స్వరూపశ్రీహరి, టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మహేశ్వర్, సహాయ కార్యదర్శి కోడూరి రవీందర్ సభ్యులు పాల్గొన్నారు.

సేవాలాల్‌కు నివాళి

హుజూరాబాద్: పట్టణంలోని సాయిరూప గార్డెన్‌లో మంగళవారం లంబాడీల ఆరాధ్య దైవం సంత్ సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతి ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ చిత్రపటానికి మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ చైర్ పర్సన్ కొలిపాక నిర్మల, తహసీల్దార్ కోమల్‌రెడ్డి, ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంపీపీ రాణి, కౌన్సిలర్ బర్మావత్ యాదగిరి నాయక్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ స్ట్రీట్ కార్నర్ మీటింగ్స్

జిల్లాలోని చొప్పదండి, మానకొండూర్, మానకొండూర్‌రూరల్, ఇల్లందకుంట, జమ్మికుంట, శంకరపట్నం మండలాల్లో మంగళవారం బీజేపీ నాయకులు బీజేపీ స్ట్రీట్ కార్నర్ సమావేశాలు నిర్వహించారు. కేంద్ర నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోందని, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్రంలో నిరంకుశ, అవినీతి, కుటుంబపాలన సాగుతోందని, ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటికీ తెలియజేయాలన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. – సాక్షి నెట్‌వర్క్

- సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

గన్నేరువరం: కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా గన్నేరువరం, జంగపల్లి జిల్లా పరిషత్ పాఠశాలల్లో మంగళవారం ఎస్సై మామిడాల సురేందర్ షీ టీమ్ సభ్యులతో కలిసి సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కల్పించారు.

రామడుగు: మోడల్ స్కూల్‌తో పాటు వివిధ పాఠశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను రామడుగు ఎస్సై అంజయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు.

‘దళితబంధు’తో ఆర్థికంగా ఎదగాలి

- కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్


మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్


వీణవంక: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దళితబంధు జాతీయ స్థాయిలో ఆదర్శంగా నిలుస్తోందని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. పథకంతో లబ్ధిదారులు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. మండలంలోని చల్లూరు గ్రామలో దళితబంధు యూనిట్లను ప్రారంభించారు. అనంతరం పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించారు. మామిడాలపల్లిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సైన్స్‌డేలో విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్, ట్రైనీ కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో, డీఆర్‌డీవో శ్రీలత, సర్పంచ్ పుదిల్ల జ్యోతి, తహసీల్దార్ రాజయ్య, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో ప్రభాకర్ పాల్గొన్నారు.

హాజరుకాని ప్రజాప్రతినిధులు..?

యూనిట్లను ఇప్పటి వరకు ఎంపీపీ, జెడ్పీటీసీ, ఇతర ప్రజాప్రతినిధులతో ప్రారంభించారు. చల్లూరులో కలెక్టర్, అదనపు కలెక్టర్ తప్పా ఇతర ప్రజాప్రతినిధులు హాజరు కాలేదు. ఎంపీపీ, జెడ్పీటీసీతో పాటు ఇతర ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వలేదని ఆగ్రహంతో ఉన్నట్లు తెలిసింది. ఈ విషయంపై ఆర్థిక మంత్రి హరీశ్‌రావు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.

కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

మానకొండూర్: తిమ్మాపూర్ మండలం మహాత్మా నగర్ గ్రామంలోని రాంలీలా మైదానంలో ఆరో తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించనున్నామని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తెలిపారు. ఎల్‌ఎండీ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం మండలంలోని మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించారు. సామాజిక సేవా, కళా రంగాల్లో విశిష్ట సేవలందించిన మానకొండూర్ నియోజకవర్గంలోని మహిళా మూర్తులకు స్త్రీ శక్తి పురస్కారాలు ప్రదానం చేసి ఘనంగా సన్మానిస్తామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కవిత, రాష్ట్ర మహిళా శిశు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ హాజరవుతారని వివరించారు. ఇతర ప్రముఖులు హాజరు కానున్నారని, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి మహిళలు భారీ సంఖ్యలో తరలి రావాలని కోరారు. నియోజకవర్గంలో తొలిపొద్దు కార్యక్రమంలో భాగంగా నేదునూర్, రేణికుంట, కొత్తపల్లి, మక్తపల్లి గ్రామాల్లో పర్యటించారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి కళ్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. తహసీల్దార్ కనకయ్య మండల అధ్యక్షుడు రావుల రమేష్ ఇనుకొండ జితేందర్ రెడ్డి,కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, ఎంపీపీ కేతిరెడ్డి వనిత, వైస్ ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి, మండల అధ్యక్షుడు రావుల రమేష్, సర్పంచ్ శ్రీవాణి, నాయకులు అశోక్ రెడ్డి, ఆంజనేయులు, అనిత, ఎంపీడీవో రవీందర్ రెడ్డి, ఏపీవో రామ్మోహన్ మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రసమయి

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

రామడుగు: బడుగు, బలహీన వర్గాల సంక్షేమం ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేస్తోందని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని వెలిచాల గ్రామంలో మంగళవారం పొద్దుపొడుపులో భాగంగా ఎనిమిది మంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ప్రవేశపెట్టి ఆడబిడ్డలకు భరోసాగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రామడుగు, కొక్కెరకుంట సింగిల్ విండో చైర్మన్లు వేంకటేశ్వర్‌రావు, మురళీకృష్ణారెడ్డి, సర్పంచ్ సరోజన, శుక్రుద్దీన్, గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రైతుబంధు జిల్లా కమిటీ సభ్యుడు సంజీవరావు, మాజీ ఎంపీపీ కిష్టారెడ్డి, నాయకులు లక్ష్మణ్, శ్రీనివాస్, రవీందర్‌రావు, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

చిగురుమామిడిలో పౌరహక్కుల దినోత్సవం

చిగురుమామిడి: సమాజంలో ఆర్థిక, సామాజికంగా వెనుకబడిన దళితుల కోసం సీఎం కేసీఆర్ దళిత బంధు పథకం ప్రవేశపెట్టారని ఎంపీపీ కొత్త వినీత అన్నారు. మంగళవారం చిగురుమామిడి అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దళితులు ఉన్నత చదువులు చదివి స్వయం ఉపాధివైపు అడుగులు వేయాలన్నారు. ఈసందర్భంగా దళిత సంఘాల నాయకులు పలు సమస్యలను ఏకరువుపెట్టారు. సమస్యలపై అధికారులు సానుకూలంగా స్పందించారు. జెడ్పీటీసీ గీకురు రవీందర్, తహసీల్దార్ ముబిన్‌అహ్మద్, ఎంపీడీఓ ఎం నర్సయ్య, ఎస్సై దాస సుధాకర్, ఏఓ రంజిత్‌కుమార్, ఆర్‌ఐ రాజు, తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మాశం సందీప్‌కుమార్, వార్డు సభ్యులు సంపత్‌కుమార్, సావిత్రి, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, బిల్‌కలెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.